# కూటి విద్యాలు

యం. యస్. గోపాలమూర్తి

రత్తయ్యగారింటో ఆరోజు మహా హడావిడిగా వుంది. ముందు వాకిలి తలుపు, గొడ్లసావిడి పక్కనున్న గేటూ మూసి గట్టిగా బిగించారు. కూలీలిద్దరు దక్షిణపు గదిలో వున్న నాగలి, కాడి, మేడి వగైరా సావిట్లోకి చేరుస్తున్నారు. అవి తీయటం పూర్తికాగానే పలుగులు పెట్టి నాలుగు గోడలమధ్య ఒక్కొక్క గోడకు ఒక్కొక్క అడుగు దూరం విడిచి చదరంగా తవ్వటం మొదలెట్టారు. రత్తయ్య దగ్గరుండి స్వయంగా తవ్విస్తున్నాడు. రత్తయ్య ముసలితల్లి, పెళ్ళాము, కూతుళ్లు, చిన్నపిల్లలు చుట్టూ కూడారు. చిన్నపిల్లలు ముక్కుమీద యేలేసుకుని "అమ్మా యెందుకే గదిలో గొయ్యి తవ్వుతుండారు?" అని అడిగితే "ఆరి మిమ్ము మారెమ్మ మింగ, మీకెందుకురా ఆ జోలీ? చద్దన్నాలు తిని బళ్లోకి పొండి" అని ఆ తల్లి సమాధాన మిచ్చింది. ఆ సమాధానం విని పిల్లలు నోరు కట్టేసుకున్నారు. గొయ్యి బాగా నాలుగైదడుగులు లోతు తీసింతర్వాత రత్తయ్య అంతటితో ఆపుజేయించాడు. తవ్విన "పాతర" గోడ పునాదుల కన్న రెండు మూడంగుళాలు కిందికి దిగటంచేత ఎట్టాపోయి ఎట్టా వస్తుందోనని "యిహ ఆపుచేయండిరా" అన్నాడు. పాలెగాళ్ళు కొట్టాంలోకి పోయి గడ్డి యెంట్లు తీసుకొచ్చి గోతిలో చుట్టూరా చుట్టారు. అడుగున మెత్తగా గడ్డివేసి చుట్టూ దిట్టంచేసి "యేమిసెలవు" అన్నట్లు చూశారు. "సూత్తారేంటిరా? గోతాలు తీసుకొచ్చి గుమ్మరించండి" అన్నాడు రత్తయ్య. వెంటనే వాళ్లు పంచపాళీలో వున్న వడ్ల గోతాలు వీపులమీద యెత్తుకొచ్చి గింజలన్నింటినీ "పాతర"లో పోసి మళ్ళా ఒక వరస గడ్డి కప్పారు. నేల బారుగా వుండేట్టు మన్ను కప్పారు. రత్తయ్య పెళ్ళాం సుబ్బరంగా అలికి ముగ్గులెట్టింది. ముసలమ్మ అక్కడ కాసేపు రాటంకూడా వడికింది.

రత్తయ్య ఆలోచనలో పడ్డాడు, "ఇంతవరకు అంతా బాగానే వుండది. లేకపోతే యీ నాలుగ్గోతాలు వడ్లు నూర్పుకుపోతే సంవత్సరం పొడుగునా మేం తినేదెట్టా? జీతగాళ్ళకి గింజలు కొలిచేదెట్టా? ఏమోరా దేవుఁడా! ఈ మాయదారి పొక్యూరుమంటు నాపాలిటికే రావాలీ? వచ్చే నెల్లో చిన్నదానికి పసుపు కుంకం చెయ్యవలసుండె. నిన్నగాక మొన్ననే గందా ఎట్టాగో కిందామీదాపడి లెక్క ప్రకారం తాసీల్దారుడికి గింజలప్పజెప్పితిని. మళ్ళీ ఇంతలోనేనా? హోరి నీ తస్సగొయ్య కాలవూఁ...!" ఇంటోంచి యేంటో గుసగుస వినపడతాంటే రత్తయ్య ఆలోచన ఆగింది. ఇంతట్లోకే పెద్ద కూతురు బయటికివచ్చి "యిట్టా లోపలికి రావే అయ్యా" అనింది. రత్తయ్య చుట్ట పారేసి లోపలికి వెళ్ళాడు. ఆడాళ్లు నలుగురూ చుట్టూతా చేరారు. అంతా ఒక్కమాటు గొణగొణమంటూ చెప్పటం సాగించారు. "ఓసి మీరట్టా వాగుతాంటే నాకు తెలియద్దంటే? నువ్ చెప్పవే పెద్దమ్మాయ్" అన్నాడు రత్తయ్య. "అది కాదే అయ్యా, అళ్లు వచ్చేటప్పుడు యెంబడే కర్రలు తీసుకొచ్చి నేలమీద పొడిచి సూత్తారంటే? బోలుమోత మోగితే తవ్వికూడా సూత్తారంట. గదిలో కర్రతో కొట్టి చూశాం. బోలుమోత మోగుతుండది" అన్నది కూతురు.

రత్తయ్య కర్ర తీసుకుని గదిలోకిపోయి కాస్సేపటికి బయటికివచ్చి కర్ర నేలమీద పారేసి నుదురుపట్టుకుని కూలబడ్డాడు. కూతుళ్లు చుట్టూ చతికిలబడ్డారు. కాస్సేపు చేతులు కొట్టుకోవటాలు, బుగ్గలు నొక్కుకోవటాలు పూర్తి అయింతర్వాత పెద్దకూతురు మెరుపల్లే లేచి అయ్యచెవిలో నోరుబెట్టి గుసగుస మన్నది. రత్తయ్య ఒక్కమాటు పళ్ళన్నీ బయటపెట్టి కర్రతీసుకుని లేచి నుంచొని పెద్ద కూతురువంక

చూసి బలేబలే అన్నాడు.

మర్నాడు పొద్దున ఎనిమిది గంటలకు పాక్కారుమెంటు తాసీల్దారు ఊర్లో అడుగు బెట్టాడు. కరణం, మునసబూ, కర్రలు పట్టుకుని వెట్టివాళ్ళు వెంటరాగా ఆయన యింటింటికి పోయి గదులు, వంటిళ్ళు, మచ్చులు, పెంటపోగులూ, వాములూ అన్నీ వెతుకుతూ, అనుమానం వేసినచోట కర్రతో పొడిచి చూస్తూ, బోలుమోత మోగితే వ్యవహారం యిన్స్పెక్టరుకు వదిలి; యిట్టా పరీక్షలు పూర్తిచేస్తూ మెల్లగా రామయ్య గారింటికి వెళ్ళాడు. రామయ్య 200 ఎకరాల ఆసామీ. ఆయనంతటివాడు ధాన్యం దాస్తాడా? అందుకని నడవలోకి మాత్రం పోయి నాలుగు గోడలకీ తగిలించిన ఫోటోలు చూసి "ఎబ్బే మీ యింటి కీవిధంగా రావటం మహాపరాధం"అని రామయ్యగారితో కబుర్లాడి, అట్టా అట్టా రత్తయ్య యింటికి చేరారు.

చెదిరిపోయిన గుండెతో నడవలో పచార్లు చేస్తున్న రత్తయ్య గుమ్మానికి ఆనుకుని నుంచున్న పెళ్ళాం వంక ఒక్కమాటు చూసి, వెంటనే తాసీల్దారుడి కెదురుగా వెళ్ళాడు. లోపలికి గెంతిన రత్తయ్య భార్య దక్షిణపు గదిలోకి పోయి, "ఆళ్లొచ్చారు. పండుకో. కాస్తంత గట్టిగా మూలుగు"అని మంచం మీద పండుకున్న పెద్దకూతురుకి పురమాయించింది. ఆమె వినే వాళ్ళ గుండెలు తరుక్కుపోయేటట్టు "ఊ" అని, "అమ్మా నొప్పి"అని, "అయ్యో బాధ"అని ఝుమ్మంటూ మూలగటం మొదలెట్టింది. "కాస్త జాగ్రత్తగా చూడవే వెంకాయా"అని ముసలమ్మ దీర్ఘాలు తీస్తూ చాకలి వెంకాయమ్మను అన్నట్లు అంది. గది తలుపులు దగ్గిరికి చేరేసి యివతల గోడకి చేరబడి నుంచున్న రత్తయ్య చిన్నకూతుళ్లు పమిట చెంగులతో కళ్లు వత్తుకుంటూ, ముక్కులు చీదటం సాగించారు.

జనాన్నంతటినీ బయట నిలిపి రెవిన్యూ ఇన్స్పెక్టరు, ఒక రైతు, రత్తయ్య, లోపలికి వచ్చారు. వరండాలోనున్న గాదెలను కొట్టి చూశాడు యిన్స్పెక్టరు. ఒకటి గట్టిగా మోగింది. ఒకటి తడికెల మోత మోగింది.

"లెక్క ప్రకారం మీ కప్పజెప్పగా మిగిలిన వియ్యేనండి. ఇయ్యేడు పొడుగుతా మాకు చాలవండి"అన్నాడు రత్తయ్య. యిన్స్పెక్టరు బుర్ర వూపి లోపల అడుగు బెట్టాడు. లోపల అంతా మూలుగులూ, రోదనలూ, కళ్లు వొత్తుకోవటాలూ, ముక్కు చీదటాలూ అంతా చూస్తుంటే అగమ్యగోచరంగా కనిపించింది. "ఏమండీ అదీ" అని అడిగాడు రత్తయ్యను. "మా పెద్ద కూతురు నీళ్లు పోసుకునే రోజులండి. కష్టపడతోంది. ఈ సంగతి మీకు బయట చెప్పినా నమ్మరని లోపలకి తీసుకొచ్చానండి. ఐతే అయిందిలెండి. మీరు తక్కినచోటు చూడొచ్చు"అని గుండె బిగపట్టుకుని బింకంగా మాట్లాడాడు రత్తయ్య. ఆ యిన్స్పెక్టరొక అమాయకపు మనిషి. కచ్చితంగా యిటువంటివి, కాకపోయినా వీటిని పోలినవి చాలా చూశాడు. అందుచేత కాస్త అనుమానించాడు. మధ్య యింట్లోనూ, వంటింట్లోనూ, దొడ్లోనూ, సావిట్లోనూ, కర్రతో నేలమీద పొడిచి చూశాడు. ఉహూఁ. పెంటపోగులోకి కర్ర బాగా పోనిచ్చి చూచాడు. ఆనవాలు చిక్కలా. మళ్ళా మధ్యగదిలోకి వచ్చి నిచ్చెన సాయంతో మచ్చుమీదికి యెక్కాడు. ఏమీ లేకపోవటం మూలాన ఉత్తచేతులతో దిగి రావట మెందుకని తలనిండా, ఒంటినిండా బూజు మాత్రం ధరించి దిగి వచ్చాడు. అయినా అతనికి ఆ గదిమీదే అనుమానం. తటపటాయిస్తూ నుంచున్నాడు. గది గుమ్మానానుకొని యిదంతా చూస్తున్న రత్తయ్య చిన్న కూతుళ్లు యిప్పుడు కాస్త గట్టిగా చీదటం సాగించారు. ముసలమ్మ దీర్ఘాలు మొదలెట్టింది. రత్తయ్య పెద్ద కూతురు ఒక్కమాటు "అమ్మో" అనింది. "మగపిల్లడు. మగపిల్లాడు" అని రత్తయ్య భార్య అరిచింది. తుపాకీతో కొట్టినట్టు రెవిన్యూ యిన్స్పెక్టరు వాకిట్లోకి గంతు పెట్టాడు. ధాన్యం పట్టుకున్నా పట్టుకోకపోయినా ఒంటినిండా బూజుతో మాత్రం బయటికి వచ్చిన యిన్స్పెక్టరును చూచిన తాసీల్దారూ, మిగతా జనం విరగబడి నవ్వుతూ పక్కయింటికి దారితీశారు. ఈనవ్వులో రత్తయ్య ఇంట్లోంచివచ్చిన తమాషా నవ్వు కలిసిపోయి గాలికి కొట్టుకుపోయింది.